

నేటి నుంచి సెమిస్టర్ పరీక్షలు

ప్రజాశక్తి - కడప అర్బన్

నగరంలోని డాక్టర్ వైఎస్ఆర్ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్ ఆర్ట్స్ విశ్వవిద్యాలయంలో ఈనెల 14 నుంచి 24వ తేదీ వరకు మొదటి సెమిస్టర్ (రెగ్యులర్) ఆర్కిటెక్చర్ విద్యార్థులకు, అలాగే రెండవ, మూడవ, నాల్గవ సెమిస్టర్ కాలేజ్ ఆఫ్ ఫైన్ ఆర్ట్స్ స్కూల్ ఆఫ్ ప్లానింగ్ విద్యార్థులకు (సప్లిమెంటరీ) పరీక్షలు నిర్వహిస్తున్నట్లు విశ్వవిద్యాలయ విసి పరీక్ష నియంత్రిక అధికారి ఆచార్య బి.ఆంజనేయ ప్రసాద్, రిజిస్ట్రార్ ఆచార్య ఇసి సురేంద్రనాథ్‌రెడ్డి ఒక సంయుక్త ప్రకటనలో తెలిపారు. స్కూల్ ఆఫ్ ప్లానింగ్‌లోని డిజిటల్ టెక్నిక్స్ ఫర్ డిజైన్ అండ్ ప్లానింగ్, ఇంటీరియర్ డిజైన్, కాలేజ్ అఫ్ ఫైన్ ఆర్ట్స్‌లోని పెయింటింగ్, ఫొటోగ్రఫీ, అప్లైడ్ ఆర్ట్, యానిమేషన్, స్కల్ప్చర్, విభాగాలకు పరీక్షలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.

ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి

- ఎపిఎన్‌జిఒ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు



శివారెడ్డిని సన్మానిస్తున్న ఎన్‌జిఒ నాయకులు

ప్రజాశక్తి-కడప అర్బన్

ఉద్యోగుల సమస్యలు ప్రభుత్వంతో చర్చించి త్వరలో పరిష్కారానికి కృషి చేస్తామని ఎపిఎన్‌జిఒ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె.వి. శివారెడ్డి, సి.హెచ్.పురుషోత్తం నాయుడు అన్నారు. బుధవారం జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో నూతనంగా ఎన్నికైన రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులకు ఆత్మీయ సన్మాన కార్యక్రమం జిల్లా అధ్యక్షులు బి.శ్రీనివాసులు, డి.రవికుమార్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ముందుగా ఇరిగేషన్ కాంపౌండ్ నుంచి కోటిరెడ్డి సర్కిల్, సంధ్య సర్కిల్ మీదుగా జడ్పీ సమావేశ మందిరం వరకు ర్యాలీ నిర్వ హించారు. రాష్ట్ర అధ్యక్షులు శివారెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం నుంచి మనకు రావలసిన అన్ని డిమాండ్స్ త్వరగా పరిష్కరిస్తామన్నారు. 12 పిఆర్‌సి, పెండింగ్ డిఎలు, జిపిఎఫ్, ఎపిజిఎల్ఐ పెండింగ్ బిల్లులు, పెన్షనర్స్ సమస్యలు, సరండర్ లీవ్, ఉపాధ్యాయ, వైద్య ఆరోగ్య ఉద్యోగుల సమస్యలపై ప్రభుత్వంతో మాట్లాడి పరిష్కారం చేస్తామని పేర్కొన్నారు. ఎపిఎన్‌జిఒ జిల్లా అధ్యక్షులు బి.శ్రీనివాసులు మాట్లాడుతూ కె.వి.శివారెడ్డి 1985 నుంచి ఎన్‌జిఒ ఉపాధ్యక్షులుగా సంఘంలో చేరి, జిల్లా కోశాధికారిగా, సెక్రటరీ, 12 సంవత్సరాలు కడప జిల్లా అధ్యక్షులుగా ఉంటూ పోరాట యోధుడిగా అనేక ఉద్యోగుల సమస్యలు పరిష్కరించారని పేర్కొన్నారు. ప్రతి ఉద్యోగికి ఆత్మీయ బంధువుగా ఉంటూ మంచి పేరు సంపాదించారని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా మూడు సంవత్సరాలు పనిచేసి, రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల మద్దతుతో ఏకగ్రీవంగా రాష్ట్ర అధ్యక్షులుగా ఎన్నికయ్యారని చెప్పారు. ఎపిజెఎసి చైర్మన్‌గా ఎన్నుకున్నారని తెలిపారు. లక్షలాది మంది ఉద్యోగుల డిమాండ్స్ సాధన కోసం కృషి చేస్తాడనే నమ్మకం అందరికి ఉందన్నారు. సి.హెచ్.పురుషోతం నాయుడు ప్రధాన కార్యాదర్శిగా సమర్థ వంతమైన నాయకత్వాన్ని పోషిస్తారని పేర్కొన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర సహాధ్యక్షులు దస్తగిరిరెడ్డి, ఉపాధ్యక్షులు వై.ప్రసాద్ యాదవ్, కోశాధికారి రంగారావు, రాష్ట్ర కార్యదర్శులు జగదీష్, కృష్ణారెడ్డి, సుబ్బారెడ్డి, రంజిత్ నాయుడు, రాంప్రసాద్, కర్నూల్, చిత్తూరు, అనంతపురం జిల్లాల అధ్యక్షులు వెంగల్‌రెడ్డి, రాఘవులు, చంద్రశేఖర్‌రెడ్డి, కార్యదర్శి చంద్రమోహన్, జిల్లా నాయకులు, జడ్‌పి రాష్ట్ర అధ్యక్షులు నాగిరెడ్డి, జిల్లా అధ్యక్షులు మల్లేశ్వర్‌రెడ్డి, ఆర్‌టిసి రాష్ట్ర నాయకులు శివారెడ్డి, నాగముని, పెన్షనర్లు అధ్యక్షులు చెన్నారెడ్డి, అసోసియేషన్ ప్రెసిడెంట్ తిమ్మారెడ్డి, ఉపాధక్షులు శ్రీనివాసులు, నరసింహారెడ్డి, బాలపుల్లయ్య, జాయింట్ సెక్రెటరీ పోలీరెడ్డి, జయలక్ష్మి, ట్రెజరర్ నిత్యపూజయ్య, సిటీ అధ్యక్షులు చిన్నయ్య, సెక్రెటరీ శైలేశ్వరరెడ్డి, అసోసియేషన్ ప్రెసిడెంట్ శ్రీనివాసన్, ఉపాధ్యక్షులు పద్మనాభం, రాజగోపాల్‌రెడ్డి, చాందుబాషా, జాయింట్ సెక్రెటరీ, మోహన్‌రెడ్డి, శుభాషిణి, రాజు, బాదుల్ల, జిల్లాలోని అన్ని తాలూకా అధ్యక్షులు, కార్యదర్శులు, ఎన్‌జిఒ నాయకులు పాల్గొన్నారు.

కబ్జాదారుల నుంచి భూములను స్వాధీనం చేసుకోండి

- ధర్నాలో వ్య.కా.స నాయకులు



ధర్నా చేస్తున్న వ్య.కా.స నాయకులు, పేదలు

ప్రజాశక్తి-గోపవరం

బద్వేల్, గోపవరం, అట్లూరు మండలాల్లో కబ్జాదారుల నుంచి ప్రభుత్వ భూములను స్వాధీనం చేసుకోవాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి అన్వేష్, జిల్లా ఉపాధ్యక్షులు డి.వెంకటేష్ డిమాండ్ చేశారు. బుధవారం మార్కెట్ యార్డు నుంచి బద్వేల్ తహశీల్దార్ కార్యాలయం వరకు వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో వందలాది మంది పేదలు ర్యాలీగా వచ్చి ధర్నా నిర్వ హించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆ భూములను స్వాధీనం చేసు కొని పేదలకు ఇళ్ల స్థలాలకు సాగు భూములకు ఇవ్వాలని పేర్కొన్నారు. బద్వేల్, గోపవరం మండలాలలో ప్రభుత్వ విలువైన భూములు ఇస్తారంగా ఉన్నాయని తెలిపారు. ఆ భూములకు దొంగ పట్టాలు, పాస్ బుక్కులు తయారుచేసి వాటిని ఆన్‌లైన్ చేయించుకున్నారన్నారు. కొంత మంది రూ.కోట్లు సొమ్ము చేసుకునే ప్రయత్నం చేస్తున్నారని చెప్పారు. వన్‌బి అడంగల్ దొంగ పేర్లతో రికార్డులో పేర్లు ఎక్కించుకొని ప్రభుత్వ భూములపై జెసిబిలు పెట్టి దర్జాగా సదును చేసుకుంటున్నా అధికారులు మాత్రం పట్టీపట్టనట్లు వ్యవహరిస్తున్నారని విమర్శించారు. కబ్జాదారుల దగ్గర పెద్ద ఎత్తున ముడుపులు తీసుకుంటూ వాళ్ల పైన ఎటువంటి చర్యలు తీసుకోవడంలేదన్నారు. పేదలు మాత్రం మూడు సెంట్లు ఇంటి స్థలం కావాలని అడిగితే మాత్రం సెంటు భూమి లేదంటూ కొన్ని నెలలుగా రెవెన్యూ అధికారులు చుట్టూ తిప్పుకుంటున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. వారం రోజుల నుంచి వ్యవసాయ కార్మికులు, ఉపాధి కార్మికులు, పేద రైతులు, పేద కూలీలు, మధ్య తరగతి కుటుంబాలు వందలాది మంది ఇంటి స్థలాల కోసం సి.కొత్తపల్లి పొలం సర్వే నెంబర్లలో ఇంటి స్థలాలు కొరకు గుడిసెలు వేసుకుని ఉండగా, ఆ భూములపైన కొంతమంది దళారీ వ్యక్తులు, భూ కబ్జాదారులు గుడిసెలు వద్దకు వచ్చి దౌర్జన్యం చేస్తూ పేదలను భయాందోళనకు గురిచేస్తూ బెదిరిస్తున్నారని పేర్కొన్నారు. మాకు పట్టాలు, పాస్ బుక్కులు, వన్‌బి అడంగల్ ఉన్నాయటూ బ్లాక్ మెయిల్ చేస్తూ ఆక్రమించుకోవడానికి ప్రయత్నం చేస్తున్నారని తెలిపారు. సి.కొత్తపల్లి పొలం పిపికుంట దగ్గర ఉన్న భూమిని పేదలకు ఇంటి స్థలాలకు ఇచ్చి ప్రభుత్వ భూములలో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేసి ప్రభుత్వ భూములను కాపాడాలని తహశీల్దార్‌కు వినతి పత్రం సమర్పించారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం మండల నాయకులు రమణ, జయరాజు, దుర్గమ్మ, రామసుబ్బమ్మ, తిరుపాలు, రాంబాబు, కదిరయ్య, లక్ష్మీనరసింహ, ఆవాజ్ జిల్లా అధ్యక్షులు చాంద్‌బాషా, పెద్ద ఎత్తున ప్రజలు పాల్గొన్నారు.

సరళమైన సాహిత్యం.. మొల్ల కవిత్వం : డిఆర్‌ఒ



మొల్ల చిత్రపటానికి నివాళులర్పిస్తున్న అధికారులు

ప్రజాశక్తి-కడప అర్బన్

విలువలతో కూడిన జీవిత సారాంశాలను సరళమైన కవితా, సాహిత్య సంపుటిగా.. సమాజానికి అందించిన గొప్ప రచయిత్రి మొల్లమాంబ అని.. ఆమె రచనలు అజరామరమని జిల్లా రెవెన్యూ అధికారి గంగాధర్ గౌడ్ పేర్కొన్నారు. బుధవారం కలెక్టరేట్ స్పందన హాలులో జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ అధికారి డాక్టర్ వి.బ్రహ్మయ్య అధ్యక్షతన శ్రీ మొల్లమాంబ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్రేగా రాష్ట్రపతి అవార్డు గ్రహీత డాక్టర్ విద్వాన్ గానుగపెంట హనుమంత రావు, ఎస్‌సి కార్పొరేషన్ ఇడి డాక్టర్ హెచ్.వెంకట సుబ్బయ్య, సాంఘీక సంక్షేమ శాఖ డిడి సరస్వతి హాజరై మొల్ల మాంబ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా డిఆర్‌ఒ మాట్లాడుతూ రామాయణ మహా గ్రంథాన్ని పలువురు వివిధ భాషలలో రచించారని వాల్మీకి లాంటి మహనీయులు రచించిన రామాయణ గ్రంథాలను ఆధారం చేసుకుని మొల్లమాంబ తనదైన శైలిలో సామాన్యులకు సైతం అర్థమయ్యే తెలుగు బాషలో మొల్ల రామాయణాన్ని సరళంగా రాయడం గర్వించదగ్గ విషయమన్నారు. గ్రంథ అవతారికతను బట్టి మొల్లమాంబ తక్కిన కవయిత్రుల లాగా గురువు వద్ద విద్యనభ్యసించలేదని, గోపవరపు శ్రీకంఠ మల్లేశుకృపను కవిత్వం చెప్పనేర్చినదని కూడా తెలుస్తోందన్నారు. బిసి వెల్ఫేర్ అధికారి డాక్టర్ బ్రహ్మయ్య మాట్లాడుతూ సాధారణంగా కవులు వర్ణనలయందు జటిలమైన, సుదీర్ఘమైన సమాసములను ఉపయోగించి పాండిత్యప్రకర్షను చూపిస్తారని పేర్కొన్నారు. కార్యక్రమంలో సంస్కృతం అధ్యాపకులు డాక్టర్ నాగేంద్రమ్మ, మొల్ల సాహితీ కమిటీ ఉపాధ్యక్షులు పి.మల్లయ్య, అష్టావధాని జగన్నాథ శాస్త్రి, వాల్మీకి సంఘ సభ్యులు డాక్టర్ శ్రీనివాసులు, దూదేకుల సంఘం సభ్యులు ఖాదర్ బాషా, విశ్రాంత ఉద్యోగి గురుమూర్తి, బిసి కులాల అధ్యక్షులు లింగమూర్తి పాల్గొన్నారు.

ప్రజా శ్రేయస్సే ప్రభుత్వ ధ్యేయం : అంజాద్‌బాషా



లబ్ధిదారులకు చెక్కును అందజేస్తున్న అంజాద్‌బాషా

ప్రజాశక్తి-కడప

పేద ప్రజల శ్రేయస్సే ప్రభుత్వ ధ్యేయమని ఉప ముఖ్యమంత్రి ఎస్.బి.అంజాద్ బాషా అన్నారు. బుధవారం స్థానిక తన నివాస కార్యాలయంలో సిఎం రిలీఫ్ ఫండ్ కింద 12 మంది లబ్దిదారులకు రూ.18.66 లక్షలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిఎం జగన్ పదవి బాధ్యతలు స్వీకరించినప్పటి నుంచి ఆరోగ్యశ్రీ పథకాన్ని దేశంలోనే మొదటి స్థానంలో నిలిపారన్నారు. ఆరోగ్యశ్రీ పథకాన్ని గత ప్రభుత్వాలు నీరుగార్చాయన్నారు. రూ.1000లు దాటితే అన్ని రోగాలను ఆరోగ్యశ్రీ పథకంలోకి తీసుకొకువచ్చారని తెలిపారు. 2350 వ్యాధులకు సంబంధించి ఆరోగ్యశ్రీ పథకంలో మరో 1000 రకాల వ్యాధులను కలిపారని తెలిపారు. ఆరోగ్యశ్రీ ద్వారా ఆపరేషన్ చేయించుకున్న రోగి తాను కోలుకునేంత వరకు డాక్టరు సలహా మేరకు చికిత్సను బట్టి ప్రతి నెలా ఆరోగ్యశ్రీ ఆసరా సాయాన్ని కూడా అందించడం దేశంలో ఎక్కడా లేని విధంగా ప్రస్తుతం మన రాష్ట్రంలో అమలవ్వడం గొప్ప విషయని పేర్కొన్నారు. ప్రతి ఆసుపత్రికి కూడా గడిచిన నెలలో ఆరోగ్య శ్రీ పథకం కింద ఎన్ని చికిత్సలు, ఆపరేషన్లు చేశారో వారికి బిల్లులు పెండింగ్ లేకుండా చెల్లించారని పేర్కొన్నారు. కడప నగరానికి చెందిన 12 మంది లబ్ధిదారులు సోమా నిర్మల, షేక్ రంతు బాషా, సయ్యద్ సుల్తాన బాను, కృష్ణపవన్, ఎం.రామయ్య, మహమ్మద్ ఇర్షద్ అలీ ఖాన్, జుటూర్ లక్ష్మీ దేవి, సయ్యద్ నూరు బాషా, పి.సాజిదా ఖానమ్, ఎ.రత్న కుమారి, టక్కోలి లక్ష్మీ దేవి, సి.వసంతమ్మలకు ముఖ్యమంత్రి సహాయనిధి కింద రూ.18.66 లక్షల చెక్కులను అంజాద్‌బాషా పంపిణీ చేశారు. లబ్ధి పొందిన లబ్ధిదారులు ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి మళ్లీ ఆయనే ముఖ్యమంత్రిగా ఉండాలని, ఉప ముఖ్యమంత్రి ఎస్‌బి అంజాద్‌బాషా కూడా భవిష్యత్తులో మరి మరిన్ని పదవులు అలంకరించాలని ఆకాక్షించారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు శ్రీరాంజన్‌రెడ్డి, చల్లా రాజశేఖర్ రెడ్డి, మాగ్బుల్, అలీ అక్బర్, జహీర్, షంషేర్, బసవరాజు, కె.బాబు, చెన్నయ్య, నాయకులు నరపురెడ్డి సుబ్బా రెడ్డి, లబ్దిదారులు పాల్గొన్నారు.

స్థానిక నాయకులకే టికెట్ ఇవ్వాలి

- టిడిపి రాష్ట్ర ఎస్‌సి సెల్ కార్యదర్శి స్వర్ణలత



కళ్లకు గంతలు కట్టుకుని నిరసన తెలుపుతున్న నాయకులు

ప్రజాశక్తి - కడప అర్బన్

ఎన్నికల సమయంలో మాత్రమే కడపలో కనపడే నాయకులకు కాకుండా, స్థానిక నాయకులకే టిడిపి టికెట్ ఇవ్వాలని రాష్ట్ర ఎస్‌సి సెల్ కార్యదర్శి బిదోళ్ల స్వర్ణలత డిమాండ్ చేశారు. ఎన్టీఆర్ సర్కిల్ వద్ద బుధవారం మహిళా కమిటీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎన్నో సమస్యలను ఎదుర్కొంటూ 20 ఏళ్లుగా టిడిపి కోసం కష్టపడి పని చేస్తూ ఉన్నామన్నారు. ఎన్నో పోరాటాల్లో పాల్గొన్న తాము జైలుకు కూడా వెళ్లామని తెలిపారు. వైసిపి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత జెండా పట్టుకునేందుకే భయపడుతున్న రోజుల్లో ధైర్యంగా నిలబడి పోరాడామన్నారు. పార్టీ కోసం కష్టపడిన మమ్మల్ని కాదని 2024 ఎన్నికలు వచ్చేసరికి మాధవి రెడ్డికి టికెట్ ఇచ్చారని పేర్కొన్నారు. ఆమె మమ్మల్ని కనీసం పట్టించుకోలేదని ఆమె పేర్కొన్నారు. పార్టీ కోసం కష్టపడిన పాత కార్యకర్తలు, నాయకులు తమకు అవసరం లేదన్నట్లు వ్యవహరిస్తూన్నారని విమర్శించారు. చంద్రబాబు మరోసారి ఆలోచించి కడప టికెట్ స్థానికులకు ఇవ్వాలని కోరారు. నిరసనలో మాజీ కౌన్సిలర్ రామలక్ష్మ మ్మ, చిప్పగిరి మీనాక్షి, తాటిగిరి నిర్మల, దేవి, శ్రీదేవి, మల్లేశ్వరి, కటారి స్వర్ణలత, పెద్ద ఎత్తున మహిళలు పాల్గొన్నారు.

'పది' విద్యార్థులకు విద్యా సామగ్రి పంపిణీ



విద్యార్థులతో మాదన విజయకుమార్

ప్రజాశక్తి - బద్వేలు

మున్సిపాలిటీ పరిధిలోని చిన్నకేశంపల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల తెలుగు ఉపాధ్యాయులు మాదన విజయకుమార్ బుధవారం పదవ తరగతి విద్యార్థులకు విద్యా సామగ్రి అందజేశారు. ఈ సందర్భంగా మాదన ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పదవ తరగతి వార్షిక పరీక్షల్లో ఉత్తమ ఫలితాల సాధన కోసం విద్యార్థులు ఒత్తిడి లేకుండా ప్రణాళికాబద్ధంగా చదవాలని సూచించారు. ఉపాధ్యాయుల సూచనలు పాటిస్తూ ఆత్మవిశ్వాసంతో పరీక్షలు రాయాలని పేర్కొన్నారు. మంచి వాతావరణంలో ఒత్తిడికి గురి కాకుండా పరీక్షలు రాయాలన్నారు. విద్యార్థులు చదువుకున్న పాఠశాలకు, ఉపాధ్యాయులకు, తల్లిదండ్రులకు కష్టపడి చదివి మంచి పేరు తీసుకురావాలన్నారు. తమకు పరీక్షలకు అవసరమైన విద్యా సామగ్రిని తెలుగు ఉపాధ్యాయులు అందజేయడం పట్ల విద్యార్థులు హర్షాన్ని వ్యక్తం చేశారు.

'ఆత్మవిశ్వాసంతోనే అద్భుత ఫలితాలు'

ప్రజాశక్తి-బద్వేలు : విద్యార్థులు ఆత్మవిశ్వాసంతోనే అద్భుత ఫలితాలు సాధించగలరని చిన్నకేశంపల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎం.ఉమాకాంత్ పేర్కొన్నారు. చిన్నకేశంపల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం పదవ తరగతి విద్యార్థుల వీడ్కోలు సమావేశాన్ని ఘనంగా నిర్వ హించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ప్రణాళిక బద్దంగా చదివితే అదుతే ఫలితాలు సాధ్యమని, ప్రణాళికతోనే ఉన్నత శిఖరా లను చేరుకోవచ్చని పేర్కొన్నారు. పరీక్షల సమయంలో ఒత్తిడికి గురి కాకుండా చదవాలన్నారు. విద్యార్థుల మేధాశక్తికి పదవ తరగతి తొలిమెట్టు అని పేర్కొ న్నారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా విచ్చేసిన పాఠశాల పూర్వ ప్రధానోపాధ్యాయులు ఎ.వి.రమణయ్య, ఆర్.రామ సుబ్బయ్యలు మాట్లాడుతూ విద్యార్థులు నిజజీవితంలో ఉన్నత శిఖరాలను చేరుకోవాలంటే కష్టపడి కాకుండా ఇష్టపడి చదవాలన్నారు. అనంతరం నిర్వహించిన విద్యార్థుల సాంస్కృతిక కార్య క్రమాలు అలరించాయి. కార్యక్రమంలో పాఠశాల స్టాఫ్ సెక్రటరీ విజయ కుమార్, విద్యా కమిటీ చైర్మన్ కె.గోపమ్మ, ఉపాధ్యాయులు ఆర్.వెంకట సుబ్బయ్య, టి.పెంచలయ్య, టి.వి. సుబ్బారావు, పి.సుబ్బరాయుడు, ఎస్.వరలక్ష్మి, వై.రామ్మోహన్ పాల్గొన్నారు.

'రాజ్యాంగ విరుద్ధమైన సిఎఎను అమలు చేయనివ్వం'

ప్రజాశక్తి కడప అర్బన్

కేంద్ర ప్రభుత్వం పౌరసత్వ సవరణ చట్టం (సిఎఎ) నిబంధనల నోటిఫికేషన్‌ను పౌరసత్వాన్ని మతపరమైన గుర్తింపుతో ముడిపెట్టడం, రాజ్యాంగ విరుద్ధమైన సిఎఎను అమలు చేయనివ్వమని వీటిపై త్వరలో పెద్ద ఎత్తున నగరంలో ఆందోళన కార్యక్రమం చేపడతామని రాజ్యాంగ పరిరక్షణ కమిటీ నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం నగరంలోని అజ్మత్ షాది ఖానాలో రాజ్యాంగ పరిరక్షణ కమిటీ నాయకులు, ఎన్ఆర్‌సి జెఎసి కన్వీనర్ అహ్మద్ బాబుబాయ్ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. సిపిఎం జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్, సిపిఐ జిల్లా కార్యదర్శి చంద్ర, న్యాయవాదులు మహమ్మద్ అలీఖాన్, సంపత్ కుమార్, డాక్టర్ ఓబుల్‌రెడ్డి, డాక్టర్ ఫారుక్, మల్లెల భాస్కర్ మాట్లాడుతూ కేంద్రం తీసుకొచ్చిన ఈ నల్ల చట్టాలను ఇప్పటికే కేరళతో సహా ఐదు రాష్ట్రాలు వ్యతిరేకించాయని పేర్కొన్నారు. ఇదే క్రమంలో మన రాష్ట్ర ప్రభుత్వం కూడా వ్యతిరేకించాలని కోరారు. సిఎఎను ఆమోదించిన నాలుగేళ్ల తర్వాత, లోక్‌సభ ఎన్నికల నోటిఫికేషన్‌కు కొద్దిరోజుల ముందు ఈ చట్టం నిబంధనల నోటిఫికేషన్ వెలువడటం అంటే, తమ ప్రయోజనాల కోసం సిఎఎ అమలును ఉపయోగించాలని బిజెపి కోరుకుంటుందని స్పష్టంగా అర్థం అవుతుందన్నారు. సిఎఎ అమలు,హానికరమైన ఈ చట్టాన్ని రద్దు చేసే వరకూ పెద్ద ఎత్తున ఆందోళనలు, పోరాటాలు కొనసాగిస్తారని తెలిపారు. త్వరలో నగరంలో పెద్ద ఎత్తున ఆందోళన చేపడుతామని చెప్పారు. సమావేశంలో ఇన్సాఫ్ రాష్ట్ర నాయకులు బాదుల్లా, ఎస్‌డిపిఐ జిల్లా కార్యదర్శి చాంద్‌బాషా, సిపిఎం నగర కార్యదర్శి రామ్మోహన్, ఎంఆర్‌ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు దస్తగిరి, కడప ఎమ్మెల్యే స్వతంత్ర అభ్యర్థి జె.కె.ఖాదర్ బాష, జిలాన్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న అహ్మద్ బాబుబాయ్

బిటి రోడ్డు, కల్వర్టులకు భూమిపూజ

ప్రజాశక్తి - కడప అర్బన్

గతంలో లేని అభివృద్ధి ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో జరుగుతోందని ఉప ముఖ్యమంత్రి ఎస్.బి.అంజద్‌బాషా, నగర మేయర్ సురేష్‌బాబు పేర్కొన్నారు. బుధవారం మున్సిపల్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో స్థానిక చిన్నచౌకు పాత బైపాస్ రోడ్డు వద్ద బిటి రోడ్డు, కల్వర్టులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చిన్నచౌకు మద్రాస్ రోడ్డు పాత బైపాస్ రోడ్డు నుంచి ఢిల్లీ పబ్లిక్ స్కూల్, పుష్పగిరి స్కూల్ మీదుగా మాచుపల్లి రోడ్డుకు ఇంటర్ కనెక్షన్ రోడ్డును ఎన్యాప్, మున్సిపల్ సాధారణ నిధుల నుంచి రూ.1.30 కోట్ల అంచనా వ్యయంతో బిటి రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేశామన్నారు. ఈ రోడ్డు చాలా ఏళ్లుగా బాగలేక ప్రజలు ఎన్నో ఇబ్బందులు పడ్డారని తమ దృష్టికి వచ్చిందన్నారు. నగరంలో అన్ని విధాలా అభివృద్ధి చేసేందుకు ముందుకెళుతున్నామన్నారు. కడప నగరాభివృద్ధిలో భాగంగా రూ.2 వేల కోట్ల నిధులు కేటాయించామన్నారు. అందులో భాగంగానే నగరంలో అన్ని కూడళ్లను అభివృద్ధి, సుందరీకరణ చేశామన్నారు. రోడ్లు విస్తరణ చేశామన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు పాల్గొన్నారు.

వృద్ధాశ్రమంలో అన్నదానం



వృద్ధులకు పండ్లు ఇస్తున్న విజయజ్యోతి

ప్రజాశక్తి-కాశినాయన

మండల పరిధిలోని ఓబులాపురం సమీపంలో గల వివేకానంద వృద్ధాశ్రమంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఎన్.డి.విజయ జ్యోతి జన్మదిన వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. అక్కడ వృద్ధులకు భోజనాలు ఏర్పాటు చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ పుట్టిన రోజు వేడుకలు వృద్ధాశ్రమంలో జరుపుకోవడం చాలా సంతోషంగా ఉందన్నారు ఎంతోమంది పేదలు వృద్ధాప్య సమయంలో వారికి సమయానికి భోజనం, ఉండటానికి ఆశ్రమం కల్పించిన రామకృష్ణారెడ్డి, రామ తులసమ్మను ఆమె అభినందించారు. వృద్ధాశ్రమానికి తన వంతు సహాయ సహకార ఎల్లవేళలా ఉంటాయని తెలిపారు.

వైవీయూ సాంస్కృతిక సమన్వయకర్తగా విజయభారతి

ప్రజాశక్తి-కడప అర్బన్

సామాజిక, సాంస్కృతిక సహపాఠ్య కార్యక్రమాల సెల్ నూతన కమిటీని ఏర్పాటు చేస్తూ విసి ఆచార్య చింత సుధాకర్ ఉత్తర్వులు జారీ చేశారు. సెల్ సమన్వయకర్తగా వాణిజ్య శాస్త్ర శాఖ ఆచార్యులు జి.విజయభారతి నియమిస్తూ బుధవారం ఉత్తర్వుల పత్రాలను విసి తన చాంబర్లో అందజేశారు. సభ్యులుగా జెనెటిక్ సెంటర్ జీనో మిక్స్ సహ ఆచార్యులు డాక్టర్ ఎ.ముని కుమారి, జంతు శాస్త్ర శాఖ సహ ఆచార్యులు డాక్టర్ ఎస్పీ వెంకటరమణ, ఫైన్ ఆర్ట్స్ విభాగం సహ ఆచార్యులు డాక్టర్ కె. మృత్యుంజయరావు, ఎకనామిక్స్ సహాయ ఆచార్యులు డాక్టర్ ఎన్.గణేష్ నాయకులను నియమించారు. ఇదివరకు సెల్ సమన్వయకర్తగా పనిచేస్తున్న ఆచార్య తప్పెట రాంప్రసాద్‌రెడ్డి, సభ్యులుగా పనిచేస్తున్న ఆచార్య ఎం.మల్లికార్జునరెడ్డి, డాక్టర్ ఎల్.మాధవి, డాక్టర్ వి.వారిజ, డాక్టర్ కె.రామసుబ్బారెడ్డి పదవీకాలం పూర్తి కావడంతో విధుల నుంచి తప్పుకున్నారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య వై.పి.వెంకటసుబ్బయ్య, హ్యుమానిటీస్ డీన్ ఆచార్య తప్పెట రాంప్రసాద్ రెడ్డి పాల్గొన్నారు.

ఘనంగా ద్వితీయ గ్రాడ్యుయేషన్ డే



డిగ్రీ పట్టా ప్రదానం చేస్తున్న విసి సుధాకర్

ప్రజాశక్తి-కడప అర్బన్

కోటిరెడ్డి ప్రభుత్వ మహిళా కళాశాలలో బుధవారం సెకండ్ గ్రాడ్యుయేషన్ దినోత్సవాన్ని (డిగ్రీ పట్టా ప్రదానోత్సవం) ఘనంగా నిర్వహించినట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ వి.సలీం బాషా తెలియజేశారు. ఈ గ్రాడ్యుయేషన్ డేకి ముఖ్యఅతిథిలుగా వైవీయూ విసి చింతా సుధాకర్, కళాశాల ఉన్నత విద్య కమిషనర్ పోలా భాస్కర్, వైవీయూ రిజిస్ట్రార్ వెంకటసుబ్బయ్య, శంకర్ ఇతర అధికారులు హాజరయ్యారు. ఈ గ్రాడ్యుయేషన్ డే సందర్భంగా 2018-21, 2019-22 విద్యా సంవత్సరములలో డిగ్రీని పూర్తి చేసుకున్న 316 మంది విద్యార్థులకు డిగ్రీ పట్టాలను అందజేశారు. అత్యధిక మార్కులు పొందిన 30 మంది మెరిట్ విద్యార్థులకు గోల్డ్ మెడల్స్ ప్రదానం చేశారు.

బాలుర వసతి గృహంలో జడ్జి తనిఖీ

ప్రజాశక్తి-కడప: సీనియర్ సివిల్ జడ్జి జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ సెక్రటరీ ఎస్.బాబా ఫక్రుద్దీన్ బుధవారం కడప నగరంలోని ప్రభుత్వ బాలుర వసతి గృహాన్ని, హాస్టల్, తరగతి గదులను పరిశీలించారు. పిల్లలు ఏఏ తరగతులను అభ్యసిస్తున్నారని అడిగి తెలుసుకున్నారు. పిల్లలు ఉంటున్న వసతి గదులను, తరగతి గదులను, వంటశాలను పరిశీలించారు. కార్యక్రమంలో ప్రభుత్వ బాలుర వసతి గృహం సూపరింటెండెంట్, డిస్టిక్ ప్రొహిబిషన్ ఆఫీసర్ కడప, వైద్యాధికారి, ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు, పిల్లలు పాల్గొన్నారు.

పీస్ స్కూల్ విద్యార్థులను అభినందించిన డైరెక్టర్




ప్రతిభ చూపిన విద్యార్థులతో డైరెక్టర్ గౌస్‌పీర్

ప్రజాశక్తి - కడప అర్బన్

నగరంలో (మను) మౌలాన అజాద్ ఉర్దూ యూనివర్సిటీ అధ్వర్యంలో నిర్వహించిన జాతీయ సైన్స్ ఫెస్ట్‌లో బహుమతులు గెలుపొందిన విద్యార్థులను పీస్ స్కూల్ డైరెక్టర్ సయ్యద్ గౌస్‌పీర్ అభినందించారు. వారిలో పోస్టర్ ప్రజెంటేషన్‌లో మొదటి బహుమతి గెలుపొందిన సయ్యద్ ఫాజియా (9వ తరగతి), మోడల్ ప్రజెంటేషన్‌లో రెండవ బహుమతి గెలుపొందిన షేక్.నాజియా (8వ తరగతి), పఠాన్ ఆఫీఫా ఖానం (8వ తరగతి). ఈ సందర్భంగా గౌస్‌పీర్ మాట్లాడుతూ ప్రతి విద్యార్థి తమలో ఉన్న మేధోశక్తిని ఉపయోగించి ఇలాంటి పోటీల్లో పాల్గొనాలని పిలుపునిచ్చారు. పాఠశాలకు, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకు రావాలని ఆయన కోరారు.

ప్రజా సంక్షేమమే కాంగ్రెస్ పార్టీ లక్ష్యం

- మహిళా జిల్లా అధ్యక్షులు సుజాతారెడ్డి



మాట్లాడుతున్న సుజాతారెడ్డి

ప్రజాశక్తి - కడప

ప్రజా సంక్షేమమే కాంగ్రెస్ పార్టీ లక్ష్యమని ఆ పార్టీ మహిళా జిల్లా అధ్యక్షులు సుజాతారెడ్డి అన్నారు. బుధవారం జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశం లో ఆమె మాట్లా డుతూ కడప జిల్లా కాంగ్రెస్ పార్టీ మహిళా అధ్యక్షులుగా తన నియామకానికి సహకరించిన పిసిసి అధ్యక్షులు షర్మిల, పిసిసి మీడియా చైర్మన్ తులసిరెడ్డి, జిల్లా అధ్యక్షులు గుండ్లకుంట శ్రీరాములు, రాష్ట్ర మహిళా అధ్యక్షులు తాంతియా కుమారికి మొదటగా కృతజ్ఞతలు తెలిపారు. మహిళలు, బడుగు, బలహీన వర్గాలు, నిరుద్యోగులు, దివంగత ముఖ్యమంత్రి వైయస్ రాజశేఖర్‌రెడ్డి అభిమా నులు షర్మిలమ్మ నాయకత్వాన్ని కోరుకుంటున్నారన్నారు. రాష్ట్రంలో అరాచక పాలన అంత మొందించి కౌరవ సభ గౌరవ సభగా మారాలంటే వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని గెలిపించాలని కోరారు. ఇందిరమ్మ అభయం పేదలకు, మహిళలకు కాంగ్రెస్ వరం. ప్రత్యేకహోదా కాంగ్రెస్‌తోనే సాధ్యమన్నారు. తాను మళ్లీ సిఎం కాకపోతే పథకాలు ఆగిపోతాయని జగన్ చెప్పడం హాస్యాస్ప దమన్నారు. సమావేశంలో సంతోషమ్మ, సోనాలి, వెంకటరమణారెడ్డి, అలీ పాల్గొన్నారు.

నిరుద్యోగ అభ్యర్థులకు అన్యాయం చేయొద్దు

ప్రజాశక్తి-కడప అర్బన్

జిల్లాలో రిమ్స్ కేన్సర్, మెంటల్ ఆసుపత్రి, పులివెందుల ఆసుపత్రిలో ఉద్యోగాల నోటిఫికేషన్‌లో అర్హులైన నిరుద్యోగ అభ్యర్థులకు అన్యాయం చేయవద్దని పారదర్శకంగా ఉద్యోగాలు భర్తీ చేయాలని డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వీరనాల శివకుమార్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వివిధ పోస్టులకు కాంట్రాక్ట్ పద్ధతిలో నోటిఫికేషన్ ఇచ్చారని పేర్కొన్నారు. తర్వాత అభ్యర్థుల ఎంపికలో గందరగోళం ఏర్పడిందని తెలిపారు. అర్హులకు కాకుండా అనర్హులకు ఉద్యోగాలకు ఎంపిక చేస్తున్నారని కొద్ది రోజుల నుంచి పత్రికల ద్వారా అందరికీ తెలిసిందని పేర్కొన్నారు. జిల్లాలో నిరుద్యోగులు ఉద్యోగాల కోసం నిరీక్షిస్తూ ఉన్నారని తెలిపారు. తక్కువ పోస్టులకు ఎక్కువ స్థాయిలో దరఖాస్తులు వెస్తున్నరంటే నిరుద్యోగం ఏ స్థాయిలో ఉందో అర్థం అవుతున్నదని పేర్కొన్నారు. కలెక్టర్ ఈ ఉద్యోగాల గందరగోళం విషయంలో జోక్యం చేసుకోవాలని తెలిపారు.

రంజాన్ వేళలు



ఇఫ్తార్	షహరీ
గురువారం (సా)	శుక్రవారం (ఉ)
6.30	5.09



సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్ కొండారెడ్డి

మహిళలకు వరం చేయూత

ప్రజాశక్తి - చక్రాయపేట

స్థానిక శ్రీ వెంకటేశ్వర రాచరాయ కళ్యాణ మండపంలో వైయస్సార్ చేయూత నాలుగో విడత నిధులు పంపిణీ కార్యక్రమాన్ని గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ, మండల మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో నిర్వహించారు. ముఖ్యఅతిథిగా మండల వైసిపి ఇన్చార్జి వైయస్ కొండారెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్‌రెడ్డి మహిళా పక్షపాతిగా మహిళా సాధికారతకు పెద్దపీట వేశారని తెలిపారు. మహిళలకు ఆర్థికంగా చేయూతనిస్తూ వారి బ్యాంక్ ఖాతాలో నేరుగా నిధులు జమ చేయడం గర్వించదగ్గ విషయమన్నారు. రాబోయే ఎన్నికలలో జగన్‌ను మళ్లీ ముఖ్యమంత్రిగా గెలిపించుకొని మన ప్రాంత అభివృద్ధికి అందరం సహకరిద్దామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో అసిస్టెంట్ ప్రాజెక్టు మేనేజర్ ఆంజనేయులు మాట్లాడారు. అనంతరం వైయస్ కొండారెడ్డి లబ్ధిదారులకు మెగా చెక్కును అందజేశారు. ముఖ్యమంత్రి జగన్ చిత్రపటానికి పాలభిషేకం చేశారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, కమ్యూనిటీ కో-ఆర్డినేటర్లు, గ్రామ సమాఖ్య అసిస్టెంట్లు, మండల మహిళా సమాఖ్య కార్యవర్గ సభ్యులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

ఉచిత విద్య కోసం దరఖాస్తుల స్వీకరణ

ప్రజాశక్తి - ఖాజీపేట

ప్రయివేట్ పాఠశాలల్లో ఉచిత విద్య కోసం ప్రభుత్వం ఆన్‌లైన్‌లో దరఖాస్తులను ఆహ్వానిస్తోందని మండలం విద్యాధికారులు సత్య నాగరాజు, నాగ స్వర్ణలత బుధవారం ఒక సంయుక్త ప్రకటనలో తెలిపారు. విద్యా హక్కు చట్టం ప్రకారం 2024-2025 విద్యా సంవత్సరానికి సంబంధించి పేద వర్గాల విద్యార్థులకు 25శాతం సీట్లు కేటాయించనున్నట్లు చెప్పారు. ఈ నెల 25 లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈ అవకాశాన్ని పేద తల్లిదండ్రులు సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు.

మోడల్ స్కూల్లో..

కాశినాయన : మండల కేంద్రమైన నర్సాపురంలోని ఎపి మోడల్ స్కూల్లో ఆరో తరగతి ప్రవేశానికి ఉచితంగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ఆ పాఠశాల ప్రిన్సిపల్ సౌజన్య తెలిపారు. బుధవారం విలేకరులతో మాట్లాడుతూ ఆన్‌లైన్ బయట చేయాలంటే అధిక మొత్తంలో ఖర్చవుతుందని తమ దృష్టికి వచ్చిందన్నారు. ఇందుకు స్పందించిన ప్రిన్సిపల్ పేద విద్యార్థుల తల్లిదండ్రులు అన్ని దరఖాస్తు ఫారాలు తెచ్చి ఉచితంగా ఆన్‌లైన్ దరఖాస్తు చేసుకోవచ్చు అన్నారు. ప్రభుత్వ రుసుం మాత్రమే చెల్లించాల్సి ఉంటుందన్నారు. విద్యార్థుల తల్లిదండ్రులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ప్రిన్సిపల్ సౌజన్య సూచించారు. **కస్తూర్బా పాఠశాలలో..** మండల పరిధిలోని వరికుంట్ల గ్రామ సమీపంలో ఉన్న కస్తూర్బా గాంధీ పాఠశాలలో 2024-25 విద్యా సంవత్సరానికిగానూ ఆరవ తరగతి, ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం ప్రవేశానికి ఆన్‌లైన్‌లో ఈనెల 12 నుండి ఏప్రిల్ 11 తేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చని ఆ పాఠశాల ప్రిన్సిపల్ నీ మెర్సీ రాణి తెలిపారు. 7,8,9వ తరగతిలో కూడా మిగిలి ఉన్న ఖాళీల కోసం ఎవరైనా దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. అనాథలు, బడి బయట పిల్లలు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ పిల్లలు, దారిద్రరేఖకు దిగువ ఉన్నవారికి మొదటి ప్రాధాన్యత ఉంటుందన్నారు. ఎంపికైన విద్యార్థులకు వారి ఫోన్ నంబర్‌కు మెసేజ్ వస్తుందన్నారు. వివరాలకు పాఠశాలను సంప్రదించాలన్నారు.

మార్కులే ప్రామాణికం కాదు

ఉషాకిరణ్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు వీడ్కోలు సభలో ఎంఇఒ

ప్రజాశక్తి - వేంపల్లె

విద్యార్థికి జీవితంలో మార్కులు ఒకటే ప్రామాణికం కాదని, సంపాదించుకున్న జ్ఞానం ద్వారా సమాజ శ్రేయస్సుకు పాటుపడాలని ఎంఇఒ-1సిఎస్ జాఫర్ సాదిక్ అన్నారు. బుధవారం స్థానిక ఉషాకిరణ్ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి విద్యార్థుల వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఎంఇఒ జాఫర్ సాదిక్ మాట్లాడుతూ విద్యార్థులు ఒక లక్ష్యాన్ని ఎంచుకొని అందుకు అనుగుణంగా శ్రమించి మంచి ఫలితాలు సాధించాలని కోరారు. రిటైర్డ్ విద్యాశాఖ అధికారి బండి వీరారెడ్డి మాట్లాడుతూ ఎంతోమంది పేద విద్యార్థులకు అందుబాటు ఫీజులతో కరస్పాండెంట్ రమణారెడ్డి అందిస్తున్న సేవలను కొనియాడారు. 10వ తరగతి పబ్లిక్ పరీక్షల్లో విద్యార్థులు జిల్లాలోనే అత్యుత్తమ ర్యాంకులు సాధించాలని ఆకాంక్షించారు. ఎంఇఒ-2స్టాలిన్ మాట్లాడుతూ విద్యార్థులకు క్రమశిక్షణ అనేది ముఖ్యమన్నారు. కరస్పాండెంట్ బిఎస్ రమణారెడ్డి మాట్లాడుతూ కుటుంబ నేపథ్యం ఏదైనా చదువు కోవడం ద్వారానే విద్యార్థులు తమ జీవిత గమనాన్ని మార్చుకోగలుగుతారని చెప్పారు. కార్యక్రమంలో పాఠశాల వ్యవస్థాపకులు గుజ్జుల కృష్ణారెడ్డి, పాఠశాల ఉపాధ్యాయ బృందం, బోధనేతర సిబ్బంది, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పరీక్ష సామగ్రి పంపిణీ

ప్రజాశక్తి - వేంపల్లె

స్థానిక తలిశెట్టి బాలికల ఉన్నత పాఠశాలలో 10వ తరగతి విద్యార్థులకు అక్షర బాలికల జూనియర్ కళాశాల కరస్పాండెంట్ విజయభారతి పరీక్ష సామగ్రి పంపిణీ చేశారు. కార్యక్రమాన్ని బుధవారం స్థానిక బాలికల పాఠశాలలో అక్షర బాలికల జూనియర్ కళాశాల ఆధ్వర్యంలో నిర్వహించారు. ప్రధానోపాధ్యాయురాలు నారాయణమ్మ విద్యార్థులకు ప్యాడ్, హాల్ టికెట్ కవర్, పెన్నులను అందజేసి మంచి ఫలితాలు సాధించాలని కోరారు. పరీక్షలపై భయం అనేది విద్యార్థుల్లో ఉండరాదని సూచించారు. ప్రతి విద్యార్థి క్రమశిక్షణతో పాటు ప్రణాళిక బద్ధంగా ఇష్టంతో చదవాలని కోరారు. ఇష్టంతో చదవడం వల్ల మంచి ఫలితాలు సాధించవచ్చని చెప్పారు. అనంతరం అక్షర బాలికల జూనియర్ కళాశాల కరస్పాండెంట్ బి.విజయభారతిని, ప్రిన్సిపల్ చందనను పాఠశాల సిబ్బంది శాలువాతో సత్కరించి కృతజ్ఞతలు తెలిపారు.

జాతీయ స్థాయికి ఐడిపిఎస్ విద్యార్థి ఎంపిక

ప్రజాశక్తి - చాపాడు : చిత్తూరులో జరిగిన రాష్ట్రస్థాయి సైన్స్ ఇన్‌స్పెయిర్ కాంపిటీషన్‌లో స్థానిక ఇంటర్‌నేషనల్ ఢిల్లీ పబ్లిక్ స్కూల్ 7వ తరగతి విద్యార్థి ఎం.జేష్ణ సాయి జాతీయ స్థాయికి ఎంపికైనట్లు పాఠశాల చైర్మన్ డాక్టర్ వి.జయచంద్రారెడ్డి తెలి పారు. త్వరలో ఢిల్లీలో జరగబోయే జాతీయ స్థాయి సైన్స్ ఇన్‌స్పెయిర్ పోటీలలో పాల్గొనబోతున్నట్లు తెలిపారు. వర్షాకాలంలో ప్రధానంగా నగరాలలో సంభ వించే మ్యాన్ హోల్స్ ప్రమాదాలను నివారించడానికి రూపొందించిన అలారం టు సేవ్ లైఫ్ అండ్ లింబ్స్ ప్రాజెక్ట్ ఆధారంగా ఐఓటి సెన్సార్ సహాయంతో పరి మిత దూరంలో ఉన్న మ్యాన్ హోల్స్ దగ్గరకు వచ్చే ప్రజలను అప్రమత్తులను చేస్తుందని, ఫలితంగా ప్రమాదాలను నివారించవచ్చునని ఆయన తెలిపారు. ఈ ప్రాజెక్టును చేపట్టిన సైన్స్ టీచర్ మిస్టర్ ప్రశాంత్‌ను ఈ సందర్భంగా పాఠశాల డైరెక్టర్ లోహిత్ రెడ్డి, ప్రిన్సిపల్ రవీంద్ర విద్యార్థిని అభినందించారు.

ఇంటింటి ప్రచారంలో వైసిపి నాయకులు

ప్రజాశక్తి - పులివెందుల టౌన్ : మున్సిపల్ వైసిపి ఇన్‌ఛార్జి వైయస్ మనోహర్‌రెడ్డి ఆదేశాల మేరకు కౌన్సిలర్లు బుధవారం ఇంటింటికి వైఎస్ఆర్ కాంగ్రెస్ కార్యక్రమాన్ని నిర్వ హించారు. అసెంబ్లీ, పార్ల మెంట్ ఎన్నికల్లో వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికి, వైఎస్ అవి నాశ్‌రెడ్డికి ఓట్లు వేసి గెలిపిం చాలని ఓటర్లను కోరారు. పట్టణంలోని 24, 15, 30వ వార్డుల్లో ప్రచారం చేశారు. కార్యక్రమాన్ని రాష్ట్ర సివిల్ సప్లై డైరెక్టర్ గంగాధర్‌రెడ్డి, వార్డు కౌన్సిలర్లు భార్గవి, పార్నపల్లి కిషోర్, డేనియల్ పురుషోత్తం, లిడ్ క్యాప్ డైరెక్టర్ రాజేశ్వరి కృష్ణమూర్తి, కో ఆప్షన్ మెం బర్ దాసరి చంద్రమౌళి ఆధ్వర్యంలో నిర్వహించారు.



ప్రచారంలో వైసిపి నాయకులు

వంతెన కోసం ఏళ్ల తరబడి ఎదురుచూపు



అధిక వర్షానికి నీట మునిగిన వంక (ఫైల్‌ఫొటో)

ప్రజాశక్తి - చాపాడు

మండల కేంద్రానికి సమీపంలోని నక్కలదిన్నె గ్రామానికి వెళ్లే దారిలో గుండ్లవంకపై వంతెన ఆధునీకరణ కోసం ఏళ్ల తరబడి ఎదురుచూస్తున్నారు. ఎన్నో ఏళ్లుగా ఆధునీకరణకు నోచుకోవడం లేదు. వర్షాకాలంలో ఈ మార్గాన రాకపోకలకు అంతరాయం కలుగుతోందని రైతులు, ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధిక వర్షాలు పడిన సమయంలో నీరు తగ్గుముఖం పట్టే వరకు మండల కేంద్రంతో సంబంధాలు లేకుండా పోతున్నాయని వాపోతున్నారు. శాస్త్ర సాంకేతికంగా దేశం ఎంతో అభివృద్ధి చెందినప్పటికీ పల్లెలు మాత్రం పాత విధానంలో నడవాల్సి వస్తోంది. వర్షం వస్తే కొన్ని రోజులుగా మండల పరిధిలోని కొన్ని గ్రామాలకు రాకపోకలు నిలిచిపోతున్నాయి. ప్రజలు గ్రామాలకే పరిమితం కావాల్సిన పరిస్థితి. ప్రభుత్వాలు మారుతున్నా వాగులు, వంకలపై పురాతన పాత వంతెనలే దర్శనమిస్తున్నాయి తప్ప, మునకకు ఆస్కారం లేకుండా హై లెవెల్ వంతెనల ఏర్పాటు జరగడం లేదు. వర్షానికి నీట మునిగిన సందర్భంలో ఆర్అండ్‌బి అధికారులు తాత్కాలిక మరమ్మతులు చేపట్టడం, తర్వాత వాటి గురించి పట్టించుకోకపోవడం నిత్యకృత్యమైందనే విమర్శలున్నాయి. రెండేళ్ల క్రితం వారం రోజులపాటు ఆయా గ్రామాల ప్రజల రాకపోకలు అంతరాయం ఏర్పడింది. ప్రస్తుతం ఉన్న వంతెన తక్కువ ఎత్తులో ఉండడం వల్ల వంకకు నీరు అధికంగా వస్తే నీట మునుగుతుంది. ప్రస్తుతం వంతెన పూర్తిగా దెబ్బతిని ఇబ్బందికరంగా మారింది. ఈ మార్గాన రాజువారిపేట, అయ్యవారిపల్లె, తిమ్మాయిపల్లి, నక్కలదిన్నె, అనంతపురం, కుచ్చుపాప, రాజుపాలెం, నరహరిపురం, వెదురూరు, రామసుబ్బమ్మ కొట్టాల గ్రామాల ప్రజలు ప్రయాణించాల్సి ఉంది. వర్షాకాలంలో ఈ మార్గాన రాకపోకలు నిలిచిపోతే ఆయా గ్రామాల ప్రజలు తాళ్లమాపురం, ప్రొద్దుటూరు మీదుగా చాపాడుకు రావాల్సి ఉంటుంది. మండల పరిధిలోని గుంతచిపాడు గ్రామానికి వెళ్లే మార్గంలో ఉన్న వంతెన కూడా ప్రమాదపుటంచున ఉంది. మోస్తరు వర్షం పడినా ఈ వంతెన నీట మునుగుతుంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి రాబోయే వర్షాకాలానికైనా వంతెనలను గుర్తించి హై లెవెల్ బ్రిడ్జిలను ఏర్పాటు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది.



ప్రస్తుతం అందుబాటులో ఉన్న లో లెవెల్ బ్రిడ్జి

విశాఖ ఉక్కు పరిరక్షణ కాంగ్రెస్‌తోనే సాధ్యం

- పిసిసి మీడియా చైర్మన్ తులసిరెడ్డి

ప్రజాశక్తి - వేంపల్లె

విశాఖ ఉక్కు.. ఆంధ్రుల హక్కు అని, విశాఖ ఉక్కు పరిరక్షణ కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యం అవుతుందని పిసిసి మీడియా చైర్మన్ డాక్టర్ తులసిరెడ్డి అన్నారు. బుధవారం వేంపల్లెలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ 32 మంది ఆత్మ బలిదానాల ఫలితంగా విశాఖ ఉక్కు కర్మాగారం ఏర్పాడినట్లు చెప్పారు. విశాఖ ఉక్కు వల్ల 1700 మంది ప్రత్యేక్షంగా, లక్ష మంది పరోక్షంగా ఉపాధి పొందుతున్నారని చెప్పారు. నవరత్నాల్లో ఒకటి అన్నారు. శ్రేష్టమైన ఉక్కును ఉత్పత్తి చేస్తున్నట్లు చెప్పారు. కరోనా సమయంలో ఆక్సిజన్ పెద్ద స్థాయిలో ఉత్పత్తి, సరఫరా చేసి వేలాది మంది ప్రాణాలను కాపాడిన ప్రాణదాత విశాఖ ఉక్కు అని ఆయన తెలిపారు. విశాఖ ఉక్కు కాంగ్రెస్ మానస పుత్రిక అన్నారు. 1971 జనవరి 20న నాటి ప్రధాని ఇందిరాగాంధీ శంకుస్థాపన చేసినట్లు చెప్పారు. రాజీవ్ గాంధీ ప్రధానిగా ఉన్నప్పుడు ఉక్కు నిర్వాసితులకు ఎకరాకు రూ.20 వేలు నష్టపరిహారం చెల్లించినట్లు చెప్పారు. ఏడాదికి మూడు మిలియన్ టన్నుల సామర్థ్యంతో పివి నరసింహారావు విశాఖ ఉక్కును జాతికి అంకితం చేసినట్లు చెప్పారు. 7.2 మిలియన్ టన్నుల సామర్థ్యంతో రెండో విభాగాన్ని మన్మోహన్ సింగ్ ప్రారభించినట్లు చెప్పారు. ఈ కర్మాగారానికి ప్రారంభంలో ఖర్చు పెట్టింది రూ.8వేల కోట్లు అన్నారు. ప్రస్తుతం విశాఖ ఉక్కు ఆస్తుల విలువ దాదాపు రూ.3 లక్షల కోట్ల అన్నారు. అటువంటి జాతి సంపదను కేవలం రూ.30 వేల కోట్లకు బిజెపికి అనుకూలమైన ప్రయివేటు కార్పోరేట్ సంస్థలకు విక్రయాలు చేయాలని మోడీ ప్రభుత్వం ప్రయత్నిస్తోందని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వాలు సృష్టించిన జాతి సంపదను మోడీ ప్రభుత్వం తెగ అమ్మేస్తున్నట్లు చెప్పారు. అందుకు ప్రాంతీయ పార్టీలైన వైసిపి, టిడిపి, జనసేన పార్టీలు బిజెపికి మద్దతు ఇవ్వడం గర్హనీ యమన్నారు. ఈనెల 15న విశాఖపట్నంలో త్రిష్టా మైదానంలో కాంగ్రెస్ నేతృత్వంలో విశాఖ ఉక్కు బహిరంగ సభను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ బహిరంగ సభకు ఎపి ఛీఫ్ షర్మిలారెడ్డి, తెలంగాణ సిఎం రేవంత్‌రెడ్డిలతోపాటు కాంగ్రెస్ అగ్ర నాయకులు హాజరవుతున్నారన్నారు. విశాఖ ఉక్కు కోసం ఏర్పాటు చేసిన బహిరంగ సభకు తరలి రావాలని తులసిరెడ్డి పిలుపు నిచ్చారు. విలేకరుల సమావేశంలో ధృవకుమార్ రెడ్డి సుబ్రహ్మణ్యం, నరసింహారెడ్డి, ఉత్తన్న, రామకృష్ణ, అమర్, బాలం సుబ్బరాయుడు, శివ పాల్గొన్నారు.

సార్వత్రిక ఎన్నికలకు సర్వసన్నద్ధం కావాలి

సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలు, ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి : ఎస్‌పి సిద్ధార్థ్ కౌశల్



మైదుకూరు : ప్రజలకు సూచనలిస్తున్న ఎస్‌పి సిద్ధార్థ్ కౌశల్

ప్రజాశక్తి - చాపాడు

రానున్న సార్వత్రిక ఎన్నికలకు పోలీస్ అధికారులు, సిబ్బంది సర్వసన్నద్ధం కావాలని, ఎలాంటి ఘటనలకు తావులేకుండా ముందస్తు ప్రణాళికతో బందోబస్తు ఏర్పాటు చేయాలని ఎస్‌పి సిద్ధార్థ్ కౌశల్ ఆదేశించారు. బుధవారం స్థానిక సిబిఐటి కాలేజి కాన్ఫరెన్స్ హాల్‌లో మైదుకూరు అసెంబ్లీ నియోజకవర్గ పోలీస్ అధికారులు, సిబ్బందికి ఎన్నికల నేపథ్యంలో రెండో దశ వర్క్ షాప్ (శిక్షణా కార్యక్రమం) నిర్వహించారు. చేపట్టాల్సిన కార్యాచరణ ప్రణాళికపై ఎస్‌పి దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్లిష్టతర, సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలు, ప్రాంతాలపై ప్రత్యేకదృష్టి సారించాలన్నారు. గత ఎన్నికల్లో నేరాలకు పాల్పడ్డ వారిపై ప్రత్యేక నిఘా ఉంచాలని ఆదేశించారు. మద్యం, నగదుతో ఓటర్లను ప్రలోభ పెట్టే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. ట్రబుల్ మాంగర్లు, రౌడీషీటర్ల కదలికలపై ప్రత్యేక నిఘా ఉంచాలని ఆదేశించారు. గ్రామాల ప్రజలతో సత్సంబంధాలు పెంపొందించుకుని సమస్యల గురించి ముందస్తు సమాచారం సేకరిస్తుండాలన్నారు. ఏదైనా సంఘటన జరిగినపుడు వెంటనే ఉన్నతాధికారులకు తెలియజేయాలన్నారు. కార్యక్రమంలో మైదుకూరు డిఎస్‌పి టి.వెంకటేశ్వర్లు, సిఐలు, ఎస్ఐలు, సెక్టార్ పోలీస్ ఆఫీసర్లు, స్పెషల్ బ్రాంచ్, ఎలక్షన్ సెల్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రొద్దుటూరు : రానున్న సార్వత్రిక ఎన్నికలకు పోలీస్ అధికారులు, సిబ్బంది సర్వసనద్ధం కావాలని, ఎలాంటి ఘటనలకు తావులేకుండా ముందస్తు ప్రణాళికతో బందోబస్తు ఏర్పాటు చేయాలని ఎస్‌పి సిద్ధార్థ్ కౌశిల్ ఆదేశించారు. ప్రొద్దుటూరు నియోజకవర్గ పోలీస్ అధికారులకు, సిబ్బందికి చేపట్టాల్సిన కార్యాచరణ ప్రణాళికపై స్థానిక ఐఎంఎ హాలులో రెండోదశ వర్క్‌షాపులో ఎస్‌పి దిశానిర్దేశం చేశారు. కార్యక్రమంలో డిఎస్‌పి మురళీధర్, సిఐలు, ఎస్ఐలు,సెక్టార్ పోలీస్ అధికారులు, స్పెషల్ బ్రాంచ్, ఎలెక్షన్ సెల్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఓటు హక్కు స్వేచ్ఛగా వినియోగించు కోవాలి

మైదుకూరు : ప్రజలు ఎలాంటి ప్రలోభాలు, భయానికి లోను కాకుండా తమ ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకోవాలని ఎస్‌పి సిద్ధార్థ్ కౌశిల్ సూచించారు. బుధవారం ఆయన మైదుకూరు అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలోని సమస్యాత్మక గ్రామాలుగా గుర్తించిన మండలంలోని నక్కలదిన్నె, కుచ్చుపాప, మైదుకూరు పట్టణంలోని మూలబాట వీధి ప్రాంతాలను సందర్శించి పరిశీలించారు. స్వేచ్ఛగా ఓటు వేసేందుకు జిల్లా పోలీస్‌శాఖ అన్ని ఏర్పాట్లు చేస్తోందన్నారు. ప్రలోభాలు, బెదిరింపులు ఎవరైనా చేసినట్లయితే పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. కార్యక్రమంలో మైదుకూరు డిఎస్‌పి టి.వెంకటేశులు, మైదుకూరు రూరల్ సిఐ శ్రీనాథ్‌రెడ్డి, మైదుకూరు సిఐ మస్తాన్, చాపాడు ఎస్ఐ కొండారెడ్డి, సిబ్బంది, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

సిఎం ఇలాఖాలో తాగునీటి సమస్య

ప్రజాశక్తి - చక్రాయపేట

ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్‌రెడ్డి సొంత నియోజకవర్గమైన పులివెందుల నియోజకవర్గంలోని చక్రాయపేట మండలంలో తాగునీటి సమస్య అధికంగా ఉందని పులివెందుల నియోజకవర్గ టిడిపి అభ్యర్థి మారెడ్డి రవీంద్రనాథ్ రెడ్డి (బీటెక్ రవి) పేర్కొన్నారు. మండలంలోని చిలేకాంపల్లి, గడ్డంవారిపల్లె గ్రామాల్లో మండల ఇన్‌ఛార్జి తాళ్లపల్లె మహేశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఇంటింటా ప్రచారం చేశారు. అనంతరం వారు విలేకరులతో మాట్లాడుతూ పాడా నిధులతో ప్రస్తుతం ఉన్న కార్యాలయాలు మరమ్మతులు చేపట్టకుండా పక్కన కొత్తగా కార్యాలయాలు నిర్మించి నిధులను దుర్వినియోగం చేస్తున్నారన్నారు. మండలంలో పాపాగ్ని నది పక్కన ఉన్న గ్రామాల్లో తప్ప ఏటికి పక్కన ఉన్న గ్రామాలు సురభి, చిలేకంపల్లి, గడ్డంవారిపల్లె, నాగలగట్టపల్లె, గ్రామాల్లో నీటి ఎద్దడి తీవ్రంగా ఉందన్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి పట్టం అశోక్‌కుమార్, మండల ఉపాధ్యక్షుడు ఎద్దుల చంద్ర, మాజీ సర్పంచులు గొంది వెంకట్రాంరెడ్డి, సుబ్బరామయ్య, క్లస్టర్ ఇన్చార్జిలు యోగేశ్వర్‌రెడ్డి, మాజీ ఉప మండల అధ్యక్షుడు నర్సింహులు, పరమేశ్వర, బూత్ కమిటీ ఇన్చార్జిలు అమర్నాథ్, ప్రసాద్, రవీంద్రారెడ్డి, ప్రసాద్‌రెడ్డి, పార్టీ కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.



చిలేకంపల్లిలో ప్రచారం చేస్తున్న బీటెక్ రవి, నాయకులు

ఇల్లూరులో ప్రభుత్వ కార్యాలయాలు ప్రారంభం

ప్రజాశక్తి - ఎర్రగుంట్ల

మండల పరిధిలోని ఇల్లూరు గ్రామంలో నూతనంగా నిర్మించిన గ్రామ సచివాలయం, విలేజ్ హెల్త్ క్లినిక్ సెంటర్, రైతు భరోసా కేంద్రాలను బుధవారం సాయంత్రం స్థానిక ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి ప్రారంభించారు. అనం తరం మండలంలోని చిన్న దండ్లూరు గ్రామంలో ఆయన గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామంలోని ప్రతి గడపకు వెళ్లి సంక్షేమ పథకాల అమలుపై ఆరా తీశారు. వైసిపికి మరోసారి అవకాశం ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో జడ్పిటిసి తమ్మిశెట్టి బాలయ్య, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



భవనాల శిలాఫలకాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

గీతాంజలిది ముమ్మాటికీ హత్యే

- ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్‌రెడ్డి

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు

తెనాలికి చెందిన గీతాంజలిది ఆత్మహత్య కాదని, ఇది టిడిపి, జనసేన కలిసి చేసిన హత్యే అని ఎమ్మెల్యే రాచమల్లు ప్రసాదరెడ్డి అన్నారు. ఎన్నికల ప్రచారం సందర్భంగా ఆయన బుధవారం 35వ వార్డులో పర్యటించారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ తెనాలి ఎమ్మెల్యే శివకుమార్ ద్వారా ఇంటి పట్టాను పొందిన తర్వాత ఎంతో సంతోషంగా విప్పారిన ముఖంతో ఈ వార్తను అందరితో పంచుకుందన్నారు. జగన్ గ్రేట్ అని చెప్పడం ఆమె తనకు తానుగా మరణశాసనం రాసుకున్నట్లయిందన్నారు. గీతాంజలిని మానసికంగా వేధించారన్నారు. అభివృద్ధి చెందుతున్న సాంకేతికతను మనుషుల పురోగతికి వినియోగించాలి కాని, ఇలా మానసికంగా వేధించడానికి కాదన్నారు. ఇందుకు బాధ్యులైన వారిని చట్టపరంగా కఠినంగా శిక్షలించాలన్నారు. మృతురాలి కుటుంబానికి జగన్ రూ.20లక్షలు నష్టపరిహారం ప్రకటించారని ఎమ్మెల్యే తెలిపారు.

'పది' పరీక్షల్లో ఉత్తమ ప్రతిభ కనబరచాలి

అప్పనపల్లి జడ్‌పి ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు రవిబాబు

ప్రజాశక్తి - ఖాజీపేట

ప్రతి విద్యార్థి కష్టపడి చదివి పదో తరగతి పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించి ప్రభుత్వ పాఠశాలలకు మంచి పేరు తీసుకురావాలని ప్రధానోపాధ్యాయులు రవిబాబు అన్నారు. బుధవారం అప్పనపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆదరణ సేవా సంస్థ ఆధ్వర్యంలో పదవ తరగతి చదువుతున్న 25 మంది విద్యార్థులకు ఉచిత పరీక్షా సామగ్రి పంపిణీ చేశారు. ముఖ్యఅతిథిగా సచివాలయం సెక్రటరీ పుల్లయ్య యాదవ్ మాట్లాడుతూ ప్రతి విద్యార్థి క్రమశిక్షణతో, రాబోవు పదవ తరగతి పరీక్షలను కష్టపడి చదివి, మంచి మార్కులు సంపాదించాలన్నారు. ఉత్తమ ఫలితాలతో పాఠశాలకు, గ్రామానికి, తల్లిదండ్రులకు మంచి పేరు తేవాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యా యులు సుబ్బారెడ్డి, భాస్కర్, ఆదరణ సేవా సంస్థ అధ్యక్షుడు బైసాని సత్యనారాయణ, కుండా మాధవ, మీకోసం విష్ణువర్ధన్, నెహ్రూ యువ కేంద్రం వాలంటీర్ ఉపేంద్ర, వీర నరేష్ పాల్గొన్నారు.

వేధిస్తున్న ఆకతాయిలపై చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

మైదుకూరు రోడ్డులోని ఉన్న శ్రీ కసెట్టి చిన్న వెంకటసుబ్బయ్య ఉన్నత పాఠశాల విద్యార్థులను ఆకతాయిలు వేధిస్తున్నారని, వారిపై చర్యలు తీసుకోవాలని బుధవారం డివైఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు గుర్రం డేవిడ్‌రాజ్, విద్యార్థులు డిప్యూటీ తహశీల్దార్ సాయి నాథ్‌రెడ్డికి వినతి పత్రం ఇచ్చారు. అనంతరం డేవిడ్‌రాజ్ మాట్లాడుతూ పాఠశాలకు విద్యార్థులు రాకపోకల సమయంలో ఆకతాయిలు స్కూలు ఆవరణలో రేకుల షెడ్డు వేసుకొని విద్యా ర్థులను వేధిస్తున్నారన్నారు. అసభ్య పదజాలంతో విద్యార్థులను ఉపాధ్యా యులను వేధిస్తున్నారన్నారు. అంతేకాకుండా పాఠశాల గేటుకు తాళం వేసి ఈ స్థలం మాది మీరు తిరగకూడదని భయభ్రాంతులకు గురి చేస్తున్నారన్నారు. విద్యార్థులు పాఠశాలకు రావాలంటే భయపడుతున్నారన్నారు. వెంటనే అధికారులు స్పందించి పాఠశాల విద్యార్థుల సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేస్తున్నామన్నారు.



డిటికి వినతిపత్రాన్నిస్తున్న డివైఎఫ్ఐ నాయకులు

రోడ్డుకు మరమ్మతులు చేయాలి

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

స్థానిక నారాపుర వెంకటేశ్వర స్వామి దేవస్థానం, పశువుల ఆసుపత్రి ముందు రోడ్డు అధ్వానంగా, ప్రజలకు అసౌకర్యంగా ఉందని డివైఎఫ్ఐ నాయకులు తెలిపారు. అధికారులు ఈ రోడ్డుకు మరమ్మతు చర్యలు చేపట్టాలని బుధవారం డివైఎఫ్ఐ పట్టణ కార్యదర్శి తులసీశ్వర్ యాదవ్ కోరారు. గతుకుల రోడ్డును ఆయన పరిశీలించారు. పట్టణంలో నిత్యం విద్యార్థులు, ప్రజలు, ఉద్యోగస్తులు అందరూ నారాపుర వెంకటేశ్వర దేవస్థానం ముందు, పశువుల ఆసుపత్రి ముందు రోడ్డులో తిరుగుతుంటారని తెలిపారు. ఆ వైపు ప్రయివేట్ పాఠశాలలున్నాయని తెలిపారు. ప్రజల, విద్యార్థులను దృష్టిలో పెట్టుకుని అధికారులు సమస్యను గుర్తించి రోడ్డు మరమ్మతు చర్యలు చేపట్టాలని కోరుతున్నామన్నారు. కార్యక్రమంలో మహేష్ పాల్గొన్నారు.

ఆర్‌టిపిపి సిఐ నాగరాజు బదిలీ

ప్రజాశక్తి - ఎర్రగుంట్ల

మండలంలోని ఆర్‌టిపిపి సిఐ నాగరాజు బుధవారం బదిలీ అయ్యారు. ఆయన విజయవాడలోని విటిపిఎస్‌కు బదిలీపై వెళ్లారు. విద్యుత్ సౌధాలో విధులు నిర్వహిస్తున్న గౌరీపతిని ప్రభుత్వం ఇక్కడికి నియమించింది. మరో రెండు మూడు రోజుల్లో గౌరీపతి తన బాధ్యతలను స్వీకరిస్తారని, అంతవరకు ఇన్‌ఛార్జి సిఐగా ఎస్ఐ సోమశేఖర్‌రెడ్డిని నియమిస్తున్నట్లు ప్రభుత్వం నుండి ఉత్తర్వులు అందాయి. బదిలీపై వెళుతున్న నాగరాజును ఆర్‌టిపిపి ఉద్యోగ, కార్మిక యూనియన్ నాయకులు, ఎస్ఐలు, ఎడిలు, ఎఇలు పూలమాలలు, శాలువాలతో ఘనంగా వీడ్కోలు పలికారు.

పోషకాహారం తప్పనిసరిగా తీసుకోవాలి

ప్రజాశక్తి - చాపాడు

గర్భిణులు, బాలింతలు, అప్పుడే పుట్టిన బిడ్డ నుండి 5 సంవత్సరాల పిల్లలకు పోషకాహారం తప్పనిసరి అని సిడిపిఒ సావిత్రమ్మ సూచించారు. పోషణ పక్వాడ పక్షోత్సవాల సందర్భంగా చాపాడు సెక్టార్ సీతారామాపురం సెంటర్‌లో బుధవారం బాలింతలు, గర్భిణులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సిడిపిఒ మాట్లాడుతూ అంగన్వాడీల ద్వారా మూడు సంవత్సరాల లోపు పిల్లల పెరుగుదలకు బాలామృతం అందిస్తున్నామన్నారు. పోషక పదార్థాలను అందిస్తున్నామని, వాటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. నిత్యం ఆహార పదార్థాల్లో ఆకుకూరలు, కూరగాయలు పోషక విలువలను పప్పు ధాన్యాలు తప్పక తీసుకోవాలన్నారు. పోషక పదా ర్థాలను పంపిణీ చేశారు. సూపర్వైజర్ రాజ్యలక్ష్మి, అంగన్వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

ఖాతాదారులకు మెరుగైన సేవలు అందిస్తాం

ప్రజాశక్తి - వేంపల్లె

ఖాతాదారులకు కెనరా బ్యాంక్ మెరుగైన సేవలు అందిస్తుందని ఆ బ్యాంకు రీజియన్ మేనేజర్ మురళిమోహన్ పేర్కొన్నారు. పులివెందుల రోడ్డులో నిర్మించిన నూతన భవనంలో బుధవారం కెనరా బ్యాంకును మార్చారు. ఈ భవనాన్ని రీజియన్ మేనేజర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారత దేశంలోనే రెండవ అతిపెద్ద బ్యాంకు కెనరా బ్యాంకు అని తెలిపారు. అలాంటి బ్యాంకును వేంపల్లెలో ప్రారంభించడం చాలా ఆనందంగా ఉందన్నారు. కెనరా బ్యాంక్ ద్వారా దాదాపు రూ.23 లక్షల కోట్ల వ్యాపారాలు, లావాదేవీలు జరుగుతున్నట్లు చెప్పారు. ఖాతాదారులకు కూడా మెరుగైన సేవలు అందించడమే తమ బ్యాంకు లక్ష్యమన్నారు. కార్యక్రమంలో డివిజన్ మేనేజర్ అయుబ్, బ్రాంచ్ మేనేజర్ మనోజ్‌కుమార్ రెడ్డి, మేనేజర్ సురేష్, బ్యాంకు సిబ్బంది పాల్గొన్నారు.



కెనరా బ్యాంకు నూతన భవనాన్ని ప్రారంభిస్తున్న మురళీమోహన్

ఘనంగా ల్యాబ్ టెక్నీషియన్స్ దినోత్సవం

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

పులివెందుల ప్రభుత్వ ఆసుపత్రిలోని రక్తనిధి ఆవరణలో ల్యాబ్ టెక్నీషియన్స్ దినోత్సవం ఈ ప్రాంత ప్రభుత్వ, ప్రైవేట్ ల్యాబ్ టెక్నీషియన్స్ బుధవారం కేక్‌కట్ చేసి ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఎపి ప్రభుత్వ ల్యాబ్ టెక్నీషియన్స్ రాష్ట్ర అధ్యక్షులు హేమ శిఖరాలరెడ్డి మాట్లాడుతూ వైద్య రంగంలో ల్యాబ్ టెక్నీషియన్ పాత్ర ఎంతో ప్రాముఖ్యమైందన్నారు. ఆ విలువ తీసుకురావడానికి ల్యాబ్ టెక్నీషియన్లు అందరు ఐక్యత చాటాలని పేర్కొన్నారు. వైయస్ఆర్ ఏపీకాస్ రక్తనిధి రక్తనిల్వ కేంద్రాల ఉద్యోగుల ఐక్య పోరాట సమితి అధ్యక్షులు రాజు మాట్లాడుతూ అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల ప్రధాన సమస్యలు ప్రభుత్వం గుర్తించి పరిష్కారం అయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే కొన్ని వృత్తి సంఘాలకు నిధులు ఏర్పాటు చేసినట్లుగానే ప్రైవేట్ ల్యాబ్ టెక్నీషియన్‌లకు ప్రత్యేక నిధులు ఏర్పాటు చేసి, వారి జీవనోపాధికి తోడ్పాటు అందించాల్సిన అవసరం ప్రభుత్వాలకు ఎంతైనా ఉందన్నారు. కార్యక్రమంలో ప్రభుత్వ, ప్రైవేట్ ల్యాబ్ టెక్నీషియన్లు పాల్గొన్నారు.



కేక్ కట్ చేస్తున్న ల్యాబ్ టెక్నీషియన్లు

క్రైం కార్నర్

గుర్తుతెలియని ప్రయాణికుడు మృతి

ప్రజాశక్తి - ఎర్రగుంట్ల

బుధవారం తిరుపతి నుండి హుబ్లీకి ప్రయాణించే రైలులో గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందినట్లు ప్రయాణికులు గుర్తించారు. ప్రయాణికులు ఎర్రగుంట్ల రైల్వే పోలీసులకు సమాచారం అందించడంతో ఎర్రగుంట్ల రైల్వేస్టేషన్లో మృతదేహాన్ని రైలు నుండి దింపి పోస్టుమార్టం నిమిత్తం ప్రొద్దుటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. రైల్వే ఎస్ఐ రారాజు మాట్లాడుతూ మృతుని వద్ద ఎలాంటి ఆధారాలు లేవని తెలిపారు. ఆయన వయసు 65 సంవత్సరాలు పైబడి ఉంటాయన్నారు. మృతుడి కుడి చేతిపై ఆంజనేయుని పచ్చబొట్టు ఉందన్నారు. ఆచూకీ తెలిసిన వారు ఎర్రగుంట్ల రైల్వే పోలీసులను సంప్రదించాలని కోరారు.

